## అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

ఇప్పుడేమో లేని ప్రేమ ఒలకబోస్తోంది

మంత్రి సత్యకుమార్ ఘాటు విమర్శలు

4





www.kothaswaram.com

APTEL/2010/31893

# కొత్తస్వరం

ప్రజాగొంతుక

తెలుగు దినపత్రిక



## సరదాగా విద్యార్థులతో కాసేపు

కాలేజీ డేస్.. వ్యక్తిగత విషయాలు పంచుకున్న నారా భువనేశ్వరి

విద్యార్థుల ముఖాముఖిలో నారా భువనేశ్వరి

5





సంపుటి 14 | సంచిక 73 | kothaswaram2024@gmail.com | ఎడిటర్ కె. సునీత | పేజీలు 05 | వెల రూ. 5.00

Published from Telangana & Andhra Pradesh

శనివారం, డిసెంబర్ 21, 2024


# సెంటు భూమి కబ్జా చేసినా తాట తీస్తాం

**భూములు కబ్జా చేయకుండా కొత్త చట్టం తెచ్చాం**

**భూ కబ్జాలు, మోసాలు, బెదిరింపులు చేస్తే కఠిన శిక్షలు**

**రెవెన్యూ సదస్సులో సీఎం చంద్రబాబు హెచ్చరిక**

**ధాన్యం సేకరణలో తేడాలు రావద్దని సూచన**



**విజయవాడ, డిసెంబర్20(కొత్తస్వరం):**

సెంటు భూమి కబ్జా చేసినా తాట తీస్తాం.. జాగ్రత్తగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. కృష్ణా జిల్లా ఈడ్పుగల్లులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సీఎం మాట్లాడారు. ఇతరుల భూములు కబ్జా చేయకుండా కొత్త చట్టం తెచ్చామని, భూ కబ్జాలు, మోసాలు, బెదిరింపులు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. 'మీ తాత, తండ్రుల కష్టార్జితం మీకే దక్కాలి. కబ్జా చేయాలనుకున్న భూమి కనిపిస్తే చాలు.. జైలు గుర్తుకు రావాలి. తప్పుడు సర్వేలు జరిగాయని లక్షల మంది ఫిర్యాదు చేశారు. సర్వే వల్ల సెంటు, రెండు సెంట్ల భూమి పోయిందని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. భూమి గురించి వచ్చే ప్రతి ఫిర్యాదునూ పరిష్కరిస్తాం. భూమి కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లలో తేడాలు (మిగతా 5లో..)

## కొరియర్‌లో డెడ్‌బాడీ

**పశ్చిమగోదావరి జిల్లాలో కలకలం**

**పశ్చిమగోదావరి,డిసెంబర్ 20 (కొత్తస్వరం ):**

పశ్చిమగోదావరి జిల్లాలో ఓ పార్సిల్ కలకలం సృష్టించింది. సాధారణంగా పార్సిల్‌లో ఏమైనా వస్తువులు వస్తాయి కానీ పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి మండలం గండిలో మాత్రం ఓ పార్సిల్‌లో మృతదేహం వచ్చింది. ఇది చూసిన వారు తీవ్ర భయాందోళలనకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. గండిలో పార్సిల్‌గా ఓ వ్యక్తి డెడ్ బాడీ వచ్చింది. జగనన్న కాలనీలో ఇంటిని నిర్మిస్తున్న సాగి తులసి అనే మహిళకు ఈ పార్సిల్ వచ్చింది. ఇంటి సామగ్రితో పాటు పార్సిల్‌గా ఓ వ్యక్తి డెడ్‌బాడీ రావడంతో తీవ్ర సంచలనంగా మారింది. ఈ పార్సిల్ రాజమండ్రి క్షత్రియ పరిషత్ నుంచి వచ్చినట్లు సమాచారం. సాగి తులసి నిర్మిస్తున్న ఇంటికి సామగ్రిని రాజమండ్రి క్షత్రియ పరిషత్ నిర్వాహకులు సరఫరా చేస్తుంటారు. ఆ మహిళకు ఇంటి సామాన్లను ఓ ఆటో డ్రైవర్ తీసుకుని వచ్చాడు. ఆ తర్వాత అతను తులసికు ఫోన్ చేసి ఇంటికి సంబంధించిన వస్తువులు వచ్చాయని ఫోన్ చేసి తెలిపాడు. సదరు మహిళ ఆ సామాన్లను తీసుకుంది. శుకవ్రారం ఉదయం ఆ వస్తువులను తెరవగానే ఒక్కసారిగా షాక్‌కు గురి అయింది. ఆ పార్సిల్‌లో వ్యక్తి మృతదేహం చూసి భయపడిపోయింది. అక్కడున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ పార్సిల్ ఎలా వచ్చిందనే దానిపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. అసలు ఈ పార్సిల్ ఎక్కడి నుంచి వచ్చింది. పార్సిల్ తెచ్చిన సదరు వ్యక్తి కదలికలపై సైతం పోలీసులు నిఘా పెట్టారు. ఆవ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. అయితే ఈ పార్సిల్‌పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## విచారణకు హాజరైన దువ్వాడ శ్రీనివాస్

**శ్రీకాకుళం జిల్లా,డిసెంబర్ 20 (కొత్తస్వరం ):**

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాధురితో కలసి పోలీసుల విచారణకు హాజరయ్యారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై దువ్వాడ అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో అతనిపై స్థానిక జనసేన నేతలు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. నవంబర్ 18 న కేసు నమోదు చేసిన టెక్కలి పోలీసులు.. దువ్వాడకు 41 ఏ నోటీసులు ఇచ్చి.. విచారణకు రావాలని పేర్కొన్నారు. దీంతో దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం మధురితో కలిసి విచారణకు వచ్చారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నేతలపై అనేక కేసులు నమోదు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో తాజాగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు టెక్కలి పోలీసులు షాక్ ఇచ్చారు. విచారణకు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు 41ఏ నోటీసులు జారీ చేసింది. తాజాగా దువ్వాడ శ్రీనివాస్‌పై జనసేన కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పవన్ కళ్యాణ్‌పై దువ్వాడ శ్రీనివాస్ తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో స్పందించిన పోలీసులు.. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దువ్వాడ శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులపై స్పందించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్.. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా తాను భయపడేది లేదన్నారు. టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేన కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారని, వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తన కారుకు కూడా నిప్పంటించారని, చంపేస్తామని బెదిరించారని వ్యాఖ్యానించారు. జనసేన కార్యకర్తల ఆగడాలపై తాను పోలీస్ స్టేషన్‌లో సాక్షాలతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంపై దువ్వాడ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం చేసిన వ్యాఖ్యలకు పోలీసులు ఇప్పుడు 41ఏ నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దువ్వాడ శ్రీనివాస్ ఎద్దేవా చేశారు.





## గిరిజన గ్రామాలకు మహర్దశ

**డోలీ బాధల నుంచి విముక్తి**

**పలు గ్రామాలకు రోడ్డు సౌకర్యం**

**రూ.36.71 కోట్ల వ్యయంతో, 39.32 కి.మీ. మేర రోడ్లు**

**శంకుస్థాపన చేసిన డిప్యూటి సిఎం పవన్**

**గిరిజన ప్రాంతాల్లో పర్యటించి సమస్యలపై చర్చ**

**పార్వతీపురం,డిసెంబర్20(కొత్తస్వరం):**

గిరిజన ప్రాంతాలకు మహర్దశ దక్కింది. తరచూ డోలీలో ప్రయాణించే ప్రమాదం నుంచి బయటపడనున్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలు తీరాలని తిరుపతి కొండ ఎక్కినప్పుడు మొక్కుకున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం మక్కువ మండలం పనసభద్ర పంచాయతీ బాగుజోల గ్రామంలో ఆయన పర్యటించారు. గిరిజన ప్రాంతాల్లో స్వయంగా పర్యటించిన పవన్.. ప్రధాన మార్గం నుంచి బాగుజోల గ్రామానికి నడిచి వెళ్లారు.. గిరిజనుల కష్టాలను స్వయంగా చూసి తెలుసుకున్నారు.. గిరిజనులకు డోలీ మోతలు తప్పేలా కొత్త రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం నూతన రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో సుమారు రూ.36.71 కోట్ల వ్యయంతో, 39.32 కి.మీ. మేర నూతన రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు.. తద్వారా 55 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. 2017 పోరాట యాత్ర సమయంలో గిరిజన ప్రాంతాల్లో పర్యటించినప్పుడు కొన్ని సమస్యలు చూశానని పవన్ తెలిపారు. తాగునీరు, రహదారులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ కట్టారు గానీ.. ఇక్కడ రోడ్లు మాత్రం వేయలేకపోయారని వైకాపా పాలనను విమర్శించారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పవన్ అన్నారు. కూటమి ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా గిరిజన ప్రాంతాల్లో రహదారులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సుందరమైన జలపాతాలు ఉన్న ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తన అభిమానులకు స్వీట్ వార్నింగ్ ఇచ్చారు..అయితే, ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతుండగా.. ఓజీ.. ఓజీ.. అంటూ ఆయన అభిమానులు నినాదాలు చేశారు.. వెంటనే వారికి స్వీట్ వార్నింగ్ ఇచ్చిన ఆయన.. ఓజీ.. ఓజీ.. అని అరవకండి.. నన్ను పని చేసుకోనివ్వండి అని సూచించారు.. నేను డిప్యూటీ సీఎంను అయినా.. ఇంకా సీఎం సీఎం అని అరుస్తున్నారు.. ఇది సరైంది కాదని హితవు చెప్పారు.. ఇక, తిరుబాటును, భాషను నేర్పించిన నేల ఇది.. మీరు సినిమాల మోజులో పడి? హీరోలకు జేజేలు కొట్టడం కాదు.. మీ జీవితాల మీద దృష్టి పెట్టండి అని సూచించారు.. ఇక, మాట్లాడితే అన్నా మీసం తిప్పు.. మీసం తిప్పు అంటారు.. నేను మీసం తెప్పితే రోడ్ల పడవు చాతీ మీద కొట్టుకుంటే రోడ్లు పడవు.. నేను ప్రధాని, ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లి చెబితే రోడ్లు పడతాయి.. అందుకే నన్ను పని చేయనివ్వండి అంటూ విజ్ఞప్తి చేశారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. 2019లో నన్ను గెలిపించలేదు? పరీక్షించారు నిలబడతాడో లేదో అని.. అది మంచిదే అన్నారు.. రోడ్ల నిర్మాణంలో క్వాలిటీ ఉందో మీరు చెక్ చేస్తూ ఉండాలి.. గొడవ పెట్టుకోండి అని సూచించారు.. డోలిలో గర్భిణీలు చనిపోతే నా చెల్లి, అక్క చనిపోయినంత బాధపడే వాడిని అంటూ గుర్తుచేసుకున్నారు పవన్ కల్యాణ్..







## రామంతాపూర్ రహదారిలో పూలకుండీల ఏర్పాటు : చేతన



**ఉప్పల్, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**
రామంతాపూర్ ప్రధాన రహదారిలో డివైడర్ మధ్యలో పూల కుండీలు ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ కక్కిరేణి చేతన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రహదారి వెంట ఏర్పాటు చేసిన పూల కుండీలను ఆమె పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పూల కుండీలను సంరక్షించేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనదారులకు అహ్లాదకరంగా ఉండేందుకు వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు వీటిని కాపాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యుబిడి మేనేజర్ నరసింహారావు, బిజెపి సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, ఎన్.సుమన్ రావు, చెల్లోజు ఎల్లాచారి, పి.హనుమంతరావు, శంకర్, సూపర్వైజర్ నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్ లో అక్రమంగా వేసిన షెడ్లు కూల్చివేత



**ఉప్పల్, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**
ఉప్పల్ భగాయత్ లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి వేసిన షెడ్లను శుక్రవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి ఫిర్యాదు మేరకు భగాయత్ లో కొందరు వ్యక్తులు అనాధికారికంగా వేసిన షెడ్లు తొలగించారు. డిప్యూటి కమిషనర్ అంజనేయులు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు షెడ్లు కొంత భాగాన్ని తొలగించారు. గత కొన్ని సంవత్సరాలుగా భగాయత్లో హెచ్ఎండిఏకు సంబంధించిన స్థలంలో మడిగెలు నిర్మించి మార్బల్ దుకాణాలకు అద్దెకు ఇచ్చారని కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి ఆరోపించారు. ఖాళీ స్థలాల ఆక్రమణలతోపాటు, అక్రమ నిర్మాణాలపై తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ సురేష్, సూపర్వైజర్ రాజు, సునీల్, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీనివాస రామానుజన్ 137వ జయంతోత్సవం



**ఉప్పల్, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**
శ్రీనివాస రామానుజన్ 137వ జయంతిని పురస్కరించుకొని ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్ లో "గణిత చరిత్ర ప్రభావం – 2030 విజన్" అనే అంశంపై ఒక ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గణిత ఆచార్యులు డా. శంకర్ రావు ముంజం పాల్గొన్నారు. డా. శంకర్ రావు రామానుజన్ గారి జీవితం, గణిత శాస్త్రానికి చేసిన కృషి, మరియు వారి సూత్రాలు ఎలా ప్రపంచ గణిత శాస్త్రాన్ని మార్చి పెట్టాయో విశ్లేషించారు. 2030 విజన్ లక్ష్యాలను సాధించడంలో గణిత శాస్త్రం కీలక పాత్ర వహిస్తుందని పేర్కొంటూ, నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు ప్రేరణ ఇచ్చారు. విద్యార్థుల సందేహాలను పరిష్కరించే విధంగా కార్యక్రమం కొనసాగింది, గణితంపై ఉన్న భయాలను తొలగించి, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంచేలా ఈ సదస్సు ప్రభావం చూపించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ట జయంతి రెడ్డి, గణిత విభాగ సమన్వయకర్త మిస్టర్ ప్రశాంత్, శ్రీమతి స్వప్న తో పాటు కాలేజ్ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎపిలో ఇన్నోవేషన్ యూనివర్సిటీ

**రెండు సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం**

**అమరావతి,డిసెంబర్20(కొత్తస్వరం):**
అధునాతన సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా ఆవిర్భవిస్తున్న ఆంధ్రప్రదేశ్లో డీప్–టెక్ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండు ప్రధాన సంస్థలతో కీలక ఒప్పందాలు చేసుకుంది. ఫిజిక్స్ వాలాఎడ్యుటెక్ కంపెనీ తన పరిశ్రమ భాగస్వామి అమెజాన్ వెబ్తో కలిసి ఆంధ్రప్రదేశ్లో ఎ–ఫోకస్డ్ ఫస్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ యూనివర్సిటీ ఆఫ్ ఇన్నొవేషన్ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో ఉన్నత విద్యను ఆధునికీకరించేందుకు టోనీలబెయిర్ ఇనిస్టిట్యూట్తో మరో ఒప్పందం చేసుకుంది. ఉండవల్లిలోని నివాసం రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఫిజిక్స్ వాలా, టోనీ లబెయిర్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు వేర్వేరుగా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు.

# యుఎస్ ఆగ్రి సీడ్స్ హైబ్రిడ్ బెండకాయ విత్తనాలతో రైతుల ఇంట్లో సిరుల పంటలే





**వెంకటేష్ (సీనియర్ ఆఫీసర్)**

**పాములపాడు, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**
యుఎస్ ఆగ్రిసీడ్స్ వారి యస్ డబ్ల్యూ004 బెండకాయ విత్తనాలతో రైతులు ఇంట్లో సిరుల పంటలే అని సీనియర్ ఆఫీసర్ వెంకటేష్ అన్నారు. కర్నూలు జిల్లాలోని, కోడుమూరు మండలంలోని, లద్దగిరి గ్రామంలో రైతు ప్రసాద్ పోలంలో ప్రదర్శన క్షేత్రాన్ని కంపెనీ ప్రతినిధులు నిర్వహించి రైతును సన్మానించారు. రానున్న రోజుల్లో పెట్టబడి తక్కువగా పెట్టి, అధిక దిగుబడి సాధించే బెండకాయ రకాలను రైతులు ఎన్నుకోవాలని కంపెనీ సీనియర్ సెల్స్ ఆఫీసర్ వెంకటేష్ తెలిపారు. అలాగే కూరగాయల పంటలో వచ్చే చీడపిడలను సకాలంలో గుర్తించి మంచి మందులు పిచుకారి చేసుకోవాలని కంపెనీ ప్రతినిధి రైతులకు తెలిపారు. రానున్న రోజుల్లో మంచి దిగుబడి అందించే బెండకాయ విత్తనాలను అందించడంలో యుఎస్ కంపెనీ ముందువరుసలో వుంటుందని కంపెనీ సీనియర్ సెల్స్ ఆఫీసర్– వెంకటేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో కోడుమూరు ,వెల్దుర్తి పరిసరాల్లో సూమారు 150మంది రైతులు, రైతులతోపాటు కంపెనీ ఎఫ్డివో, మహనంది మరియు విత్తనాలు షాప్ యజమానులు పాల్గొన్నారు.

# నాటు సారా తయారీ బట్టిలపై కొనసాగుతున్న దాడులు : ఎక్సైజ్ సీఐ





**తయారీదారులకు నాటు సారా వల్ల కలిగే నష్టాలపై అవగాహన**

**రెండు వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం**

**షికారి పేటలో నాటు సారా పై ఆగని దాడులు**

**నందికొట్కూర్, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**
నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని నీలి షికారి పేటలో ఎక్సైజ్ అధికారుల మూకుమ్మడి దాడి గా చేసి 2000 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా నీలి షికారి పేటలో డ్రమ్ములతో భూమిలో పాతిపెట్టిన బెల్లం ఊట సారాను ధ్వంసం చేశారు. ఈ దాడులు కర్నూలు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి మరియు నంద్యాల జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించడం జరిగిందని స్థానిక ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన నాటు సారా తయారీ ధరలకు సారా తయారీ వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ దాడు లలో ఆత్మకూరు ఎక్సైజ్ కిషోర్ ,హెడ్ కానిస్టేబుల్ శంకర్ నాయక్ ,పద్మనాభం ,కృప కుమారి ,రాజు ,కానిస్టేబుల్ రామకృష్ణుడు ,మధు ప్రసాద్ ,సుదీప్ పాల్గొన్నారు.

# ఘనంగా సెమీ క్రిస్మస్

**పాములపాడు, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**
మండల కేంద్రం లో ఉన్నటువంటి సీఎస్ఐ సంఘంలో రెవరెండ్. వేల్పుల. ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు చాలా గొప్పగా ఘనంగా జరిగాయి.ఈ ప్రార్ధన కార్యక్రమం లోప్రసాద్ బాబు దైవసందేశం ఇస్తూ మనకోసం మన పిల్లల కోసం యేసుక్రీస్తు ప్రభుల వారు ఆయన మానవరూపంలో ఈ భూలోకం లో మన కోసం జన్మించారు. ఆయన ప్రేమ, కరుణ, ద్వారానే మానవాళికి ఆనందం, నింపిన యేసుక్రీస్తు జీవితం అందరికి ఆదర్శ ప్రాయంగా, ఏసుక్రీస్తు జన్మదిన పర్వదినాన్ని, ప్రజలంతా ప్రతి ఒక్కరి కుటుంబం లో ఆనందం నింపడానికి, శత్రువుల సైతం మంచి ప్రవర్తనతో, మారుమనస్సు పొంది, ప్రతి ఒక్కరూ నిత్య పరలోక రాజ్యానికి, వారసులం కావాలి అని రెవరెండ్. వేల్పుల ప్రసాద్ బాబు గారు శాంత కుమారి.పాస్టర్ అమ్మ దేవుడు పాటలతో దేవుడు మహిమపరచారు. మరియు యోనా. పాస్టర్,గారు దైవ సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ దేవునికి వారసులం కావాలి చెడు పనులు వదిలేసి మారు మనసు కలగాలి.ప్రతి ఒక్కరి గుండెల్లో యేసుప్రభూ చేర్చుకోవాలి. అందరూ పరలోక రాజ్యానికి వారసులం కావాలి అని యోనా, పాస్టర్లు వివరించారు.,మరియు అంతేకాకుండా ప్రార్ధన కి వచ్చిన చంద్రశేఖర్, కృపాకర్ పాస్టర్లకు,గారిని పూలదండలు వేసి,శాలువాలతో, సన్మానించడం జరిగింది. అంతే కాకుండా వచ్చిన ముఖ్య అతిధులకు కూడా సన్మానం చేయడం జరిగింది..ఈ కార్యక్రమం లో పిల్లలతో దేవుడు నీ పాటలతో, దేవుని నృత్యం లతో చక్కటి,యేసేపు, లూకా గారి,సంగీత బృందం తో మరియు దేవుడు కి మహిమ కరముగా జరిపించింబడ్డాయి. అంతే కాకుండా సి ఎస్ ఐ, సంఘములో సంఘ పెద్ద మనుషులు, సండే స్కూల్ టీచర్, అనురాధ, మరియు కలబండి, విజయ భాస్కర్, కలబండి, బాలరాజు, రఘు, మరియు కలబండి యూత్. నాగరాజు ఆధ్వర్యంలో అద్భుతంగాచేసిన పరిచర్యలో వాడబడటం, మరియు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు నల్లమల్ల అబ్రహం,మరియు నంద్యాల జిల్లా కార్యదర్శి, కలబండి. అంకన్న. మరియు వచ్చిన వారందరికీ ప్రేమ విందు పెట్టడం జరిగింది.సంఘము విశ్వాసులు, పెద్దలు కలిసి సెమీ క్రిస్మస్ వేడుకలు విజయవంతంగా జరిగాయి.













# అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేసిన కామ్రేడ్లు





**అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు**

**అమిత్ షా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలి : సీపీఎం**

**నందికొట్కూరు, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**

ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని సిపిఎం నాయకులు పి ఫకీర్ సాహెబ్ అన్నారు.మండల కేంద్రమైన పగిద్యాల లో శుక్రవారం బస్టాండ్ సెంటర్లో ఆ పార్టీ నాయకులు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలు లో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన ఆదాని ని వెనుకేసు వచ్చిపార్లమెంటులో ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేక చర్చను పక్కదారి పట్టించేందుకు ఈ మార్గం ఎంచుకున్నారని ఆయన విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడం ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజల అంబేద్కర్ వాదుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని తక్షణమే అమిత్ షా పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రివ్యాఖ్యలను ప్రధానమంత్రి మోడీ సమ్మర్థించ దాని కామ్రేడ్లు తప్పు పట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి బాబు తిక్క స్వామి ప్రజా సంఘాల నాయకులు పకీరయ్య నరసింహులు చిన్న అదుర్స్ ,గంధం హుసేనమ్మ తదితరులు పాల్గొన్నారు. ఏఐకె ఎంఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో నందికొట్కూరు బస్టాండ్ సెంటర్లో అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సోడా బిబి, లక్ష్మీదేవి సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పై అధికారులు సమీక్ష



**శ్రీశైలం, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**



శుక్రవారం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు, దేవస్థానం యూనిట్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు మరియు పర్యవేక్షకులు, మరియు వైదికకమిటీతో ప్రాథమిక సమావేశం నిర్వహించారు.2025 మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19 నుండి మార్చి 1 వరకు జరగనున్నాయి.ఈ కార్యక్రమంలో ముందుగా గత సంవత్సరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రూపొందించిన డాక్యుమెంటరీ ప్రదర్శించబడింది. బ్రహ్మోత్సవాలకు ఫిబ్రవరి 19వ తేదీ ప్రారంభమైనప్పటికీ ముందస్తు భక్తులు క్షేత్రానికి చేరుకుంటారు అని చెబుతూ అన్ని ఏర్పాట్లు కూడా ముందస్తుగా పూర్తి కావడం తప్పనిసరి అన్నారు. అదేవిధంగా దేవస్థానం ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అన్ని ఏర్పాట్లు కూడా ఫిబ్రవరి మొదటివారం చివరికల్లా పూర్తయి విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశానికి స్థానిక తహసీల్దార్ కేవీ శ్రీనివాసులు అటవీ రేంజి అధికారి సుభాష్ రెడ్డి దేవస్థానం అపోలో వైద్యులు డాక్టర్ టి శశిధర్ ప్రసంగించారు, అలాగే దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్లిం సోదరుల గౌసే పాక్కదర్గా గ్యార్వి షరీఫ్ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి



**మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం డిసెంబర్ 20 కొత్త స్వరం ప్రతినిధి**



నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు గౌసే పాక్క దర్గా గ్యార్వి షరీఫ్ కార్యక్రమానికి పాల్గొన్న నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హిందూ ముస్లిం బేధాభిప్రాయాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి పాషా , కో ఆప్షన్ సభ్యులు ఎండి షఫీ, షేక్ గౌస్, షేక్ జాంగిర్, ఎండి అంజాద్, లాల, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు జాల బోయిన కృష్ణ యాదవ్, ప్రవీణ్ యాదవ్, మామిలా చంద్రశేఖర్ యాదవ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు అందజేత

**రాజేంద్రనగర్, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**




విద్యార్థులు టీవీలు, సెల్ ఫోన్ లు, కంప్యూటర్ ల వినియోగాన్ని వీలైనంతగా తగ్గించుకుంటే కంటి సమస్యల బారిన పడకుండా ఉండొచ్చని హోలీ క్రాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు మాడుగుల ఉదయ్ కుమార్ అన్నారు. గత నెల 20 వ తేదీన రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 20 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించామని, వారందరికీ శుక్రవారం తమ సంస్థ ఆధ్వర్యంలో కండ్లద్దాలను ఉచితంగా అందజేశామన్నారు. దాతలు వల్లభనేని సతీశ్, మునిని ఉపేందర్, పొట్టుముత్తు విశ్వకాంత్ ల ఆర్థిక సహకారంతో విద్యార్థులకు కండ్లద్దాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో హోలీ క్రాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరిన్ని ఆరోగ్య, కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ, ఉపాధ్యాయులు జూనపల్లి శ్రీనివాసరావు, సీతారామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు ప్రారంభం

**మేయర్ శాంతి కోటేష్ గౌడ్,డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా**



**జవహర్ నగర్, డిసెంబర్ 20 కొత్త స్వరం ప్రతినిధి**

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ న్యూ వెంకటేశ్వర కాలనీ (బీరప్ప గడ్డ) లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను జవహర్ నగర్ మున్సిపల్ జనరల్ నిధుల నుండి 5లక్షల మంజూరు చేసి మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ గుప్తా, పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని పలు డివిజన్లకు అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పాల్గొన్న కార్పొరేటర్లకు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ శాంతి కోటేష్ గౌడ్,డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్త,కార్పొరేటర్ కుతాడి సాయి ,గొడుగు వేణు, శారద మనోహర్ రెడ్డి, బింగి లావణ్య సతీష్ గౌడ్,బస్తి నాయకులు కానీ వాసులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



**చిత్తూరు, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**

చిత్తూరు జిల్లా విజయపురం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ 2024 నవంబర్ 7వ తేదీన అనారోగ్యంతో పీసీ 4337 తంగరాజు మరణించారు. మరణించడం రంగరాజు సతీమణి వల్లియమ్మ కి శుక్రవారం విడో ఫండ్ నుండి రూ.50,000 వేలు మరియు ఫ్లాగ్ ఫండ్ నుండి రూ.25,000 చెక్కులను జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు, ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్/ఇంచార్జ్ అడ్మిన్ ఎస్.ఆర్.రాజశేఖర్ రాజు చిత్తూరు పోలీస్ ఆఫీస్ 'బి' సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం క్లర్క్ పార్ధసారధి నాయుడు సమక్షంలో చిత్తూరు పోలీస్ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ చనిపోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, పోలీస్ శాఖ తరపున వారికి అన్ని విధాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ డిపార్టుమెంటు తరపున కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాలు ఆలస్యమవ్వకుండా చూస్తామని, ఏవైనా సమస్యలు ఉంటే నిరభ్యంతరంగా సంప్రదించవచ్చని తెలిపారు.


## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**

**సిబ్బంది సమస్యల పరిష్కారంకు ప్రత్యేకంగా “పోలీసు వెల్ఫేర్ డే” నిర్వహించిన జిల్లా ఎస్పీ**

**పోలీసు సిబ్బంది సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**

**సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపడతానన్న జిల్లా ఎస్పీ**



**విజయనగరం, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**

విజయనగరం జిల్లా పోలీసుశాఖలో వివిధ హెూదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో "పోలీసు వెల్ఫేర్ డే”నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, మాట్లాడుతూ – పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. “పోలీసు వెల్ఫేర్ డే” నిర్వహించుటలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని పోలీసు కార్యాలయంలోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన జిల్లా ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను జిల్లా ఎస్పీ స్వయంగా పుస్తకంలో నోట్ చేసుకొని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

## తూర్పుగోదావరి జిల్లా డి.ఎస్.పి (స్పెషల్ బ్రాంచ్)గా బాధ్యతలు స్వీకరించిన బి. రామకృష్ణ



**రాజమండ్రి, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**



తూర్పుగోదావరి జిల్లాకు డి.ఎస్.పి (స్పెషల్ బ్రాంచ్) గా శుక్రవారం బి. రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. 1991 బ్యాచ్ కు చెందిన బి. రామకృష్ణ గతంలో ఎస్. డి.పి.ఓ గా రామచంద్రపురం, కోనసీమ జిల్లా నందు విధులు నిర్వహిస్తూ, ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు డి.ఎస్.పి( స్పెషల్ బ్రాంచ్) గా నియమితులయ్యారు.

## బ్యాంక్ కాలనీలో డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి : బన్నాల గీత



**ఉప్పల్, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**
చిలుకానగర్ డివిజన్ బ్యాంక్ కాలనీలో చేపట్టిన బాక్స్ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పలువురు అధికారులతో కలిసి ఆమె డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు నత్తనడకన జరుగుతున్నాయని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని సూచించారు. కాగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే పనులు సంవత్సరాలుగా సాగుతున్నాయని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు వంద కాలనీలకు రాకపోకలు సాగించే ఈ రహదారిలో రెండు నెలలుగా నత్తనడకన సాగుతున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో డిఇ వినీల్ గౌడ్, ఎఇ వినీల్ రావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఏదుల కొండల్ రెడ్డి, కె.జగన్, శ్యామ్, రవీందర్ గౌడ్, షఫీ, హనీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యనారాయణస్వామి ఆలయ కమిటి ప్రమాణ స్వీకారోత్సవం



**ఉప్పల్, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**
రామంతాపూర్ లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి నూతన కమిటి ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హజరై పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్గా గా కోట్ల నరసింహారెడ్డి, సభ్యులుగా పూస సత్తయ్య, అన్నమనేని జగదీష్ కుమార్, జి.విజయభాస్కర్, ముత్యాల బాబు, బుల్లెట్ అశోక్, కనెబోయిన అంబిక ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, పార్టీ కోసం పనిచేసిన వారికి తగు గుర్తింపు ఇస్తున్నామని తెలిపారు. ఆలయం అభివృద్ధికి కొత్త కమిటి నేతలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయభారతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కంది ఆగిరెడ్డి, బి. సుధాకర్ రెడ్డి, బి. మోహన్ రెడ్డి, సి.రఘుపతిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఎం.డి. రఫీక్, గణేష్ నాయక్, సుర్వి మురళీగౌడ్, తవిడ బోయిన గిరిబాబు, కాపర్తి మోహనకృష్ణ, శాగ శ్రీధర్, వినోద్ గౌడ్, గరిక సుధాకర్, నామ్ రాజిరెడ్డి, సందీప్, జిల్లు, సచిన్, సంధ్యారాణి, శోభ, గాయత్రి, వినోద్, చింటూ, అశోక్, ఎర్వ అశోక్,జంగయ్య, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి : శ్రీవాణి




**ఉప్పల్, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**
రామంతాపూర్ కు ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలని స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు రామంతాపూర్ నుంచి వెళ్లాల్సిన ఆర్టిసి బస్సును కరోనా కారణంగా నిలిపివేశారని, అప్పటి నుంచి బస్సు సౌకర్యం కల్పించడం లేదని, దీంతో పలువురు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల సమస్యలు దృష్టిలో ఉంచుకుని తిరిగి బస్సును ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. దీనిపై అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి














**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**

**వార్షిక తనిఖీల్లో భాగంగా విజయనగరం రూరల్ పోలీసు స్టేషను సందర్శించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**

**పోలీసు స్టేషను పరిసరాలు, ప్రాపర్టీ రూం, లాకప్ సెల్స్, సీజ్ వాహనాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ**

**పోలీసు స్టేషను రికార్డులు, సిడీ ఫైల్స్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,**

**మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత గ్రామాల పోలీసు సిబ్బందితో సమేకమై, వారు నిర్వహించాల్సిన విధులపై దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ**

**విజయనగరం, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**
వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, శుక్రవారం విజయనగరం రూరల్ పోలీసు స్టేషను సందర్శించి, స్టేషను పరిసరాలు, లాకప్ సెల్స్, ప్రాపర్టీ రూం, వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ వివిధ కేసుల్లో సీజ్ చేసిన ప్రాపర్టీ వివరాలను ప్రాపర్టీ రిజిష్టరు నందు నమోదు చేయాలని, అవసరం లేని వాహనాలను రిలీజ్ చేసి, యజమానులకు అప్పగించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణ, వినియోగం, విక్రయాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి వినియోగం, విక్రయాలు, సరఫరాతో సంబంధం ఉన్న వారిని ఎట్టి పరిస్థితుల్లోను వదిలి పెట్టవద్దని, వారిని తప్పనిసరిగా కేసుల్లో నిందితులుగా చేర్చి, చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దర్యాప్తులో ఉన్న చోరీ కేసులను ఛేదించే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆయా కేసుల్లో నిందితులను గుర్తించి, అరెస్టులు చేసి, చోరీ సొత్తును తిరిగి రికవరీ చేయాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజల్లోను, యువతలోను చైతన్యం తీసుకొని వచ్చేందుకు 'సంకల్పం' కార్యక్రమాను చేపట్టి, అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. రహదారి ప్రమాదాలు తరుచూ జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలను నియంత్రించేందుకు కారణాలను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా అవసరమైన ఇంజనీరింగు మార్పులు చేపట్టాలని, వాహనాలను వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్లును, స్పీడు బ్రేకర్లును ఏర్పాటు చేయాలని, బ్లాక్ స్పాట్స్కు ఇరువైపుల హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో నేరాలను నియంత్రించుటకు సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, అందుకు ఎం.ఎస్.పి.ల సహకారాన్ని తీసుకోవాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. అనంతరం, రూరల్ పిఎస్ పరిధిలో పని చేస్తున్న మహిళా సంరక్షణ పోలీసులు, పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ సమేకమై, వారికి దత్తతగా అప్పగించిన గ్రామాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, భూతగదాలు, గొడవలు, రాజకీయ పార్టీల వైరాలు, పాత నేరస్తులు, హిస్టరీషీట్లు కలిగిన వ్యక్తుల వివరాలు, గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగం గురించిన సమాచారం సేకరించి, ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. ప్రతీ వారం విధిగా దత్తత గ్రామాల్లో పోలీసులు సందర్శించాలని, ప్రజలకు సైబరు మోసాలు. డిజిటల్ అరెస్టు, మహిళల భద్రత, రహదారి భద్రత పట్ల క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎవరైనా సైబరు మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ పోలీసులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. పోలీసు సిబ్బంది సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం, పోలీసు స్టేషనులో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులు, వివిధ న్యాయ స్థానాల్లో ట్రయల్స్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సిడీ ఫైల్స్ ను జిల్లా ఎస్పీ పరిశీలించి, కేసుల దర్యాప్తు పూర్తి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేసారు. స్టేషను పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణకు ఇన్ఫార్మర్ వ్యవస్థను మెరుగుపర్చుకోవాలని, సమాచార సేకరణకు ఎమ్ఎస్పీల, దత్తత గ్రామ పోలీసుల సేవలను సమర్ధవంతంగా వినియోగించు కోవాలన్నారు. వివిధ స్టేషన్ రికార్డ్స్, జనరల్ డైరీ, పార్టు 1-5 రికార్డ్స్, హిస్టరీ షీట్స్, ప్రాసెస్ రిజిష్టరు, ఎఫ్.ఐ.ఆర్. ఇండెక్స్, కే.డి. చెక్ రిజిష్టరు, క్రైమ్ చార్ట్, క్రైమ్ ఆబ్రాక్ట్, బీట్ బుక్స్ లను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తనిఖీ చేశారు. అనంతరం, వృద్ధులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ దుప్పట్లు, వండ్లు, వారి దినచర్యలకు అవసరమయ్యే టూత్ బ్రష్, సబ్బులు, టూత్ పేస్టు మరియు ఇతర వస్తువులను అందజేసారు. ఈ వార్షిక తనిఖీల్లో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, విజయనగరం రూరల్ సిఐ బి. లక్ష్మణరావు, ఎస్ఐ అశోక్ కుమార్, ఎస్సై సిఐ ఏవి లీలారావు, మరియు ఇతర పోలీసు అధికారులు, ఎమ్ఎస్పిలు, దత్తత పోలీసులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ను అవమానించిందే కాంగ్రెస్

**ఇప్పుడేమో లేని ప్రేమ ఒలకబోస్తోంది**

**మంత్రి సత్యకుమార్ ఘాటు విమర్శలు**

**విజయవాడ,డిసెంబర్20(కొత్తస్వరం):**
అంబేద్కర్ను అవమానించిన కాంగ్రెస్ ఇప్పుడు డ్రామాలు అడుతోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. దేశంలో కాంగ్రెస్ చేసినన్ని అరాచకాలు ఇంకెవ్వరూ చేయలేదన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా రాజ్యాంగ బద్ధంగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రతిపక్షాలు పార్లమెంట్లో సమయాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్కు ఉన్నట్టుండి రాజ్యాంగం, అంబేద్కర్ మీద ప్రేమ పుట్టుకువచ్చిందని విమర్శించారు. శుక్రవారం విజయవాడలో మంత్రి సత్యకుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో 24వ సవరణ తీసుకువచ్చి ప్రజలకు ఉన్న ప్రాథమిక హక్కులు హరించే విధంగా కాంగ్రెస్ పాలన చేసిందని అన్నారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ భ్రష్టు పట్టించిందని విమర్శించారు. రాజ్యాంగం రచించేటప్పుడు అంబేద్కర్ని అవమానపరిచేలా కాంగ్రెస్ పార్టీ కార్టూన్స్ని విడుదల చేశారన్నారు. అంబేద్కర్ని నెహ్రూ చాలా విధాలుగా అగౌరవపరిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ని ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడిరచారని చెప్పారు. 'అంబేద్కర్ పోటీ చేసినప్పుడు బీజేపీ అభ్యర్థిని పోటీకి దించకుండా ఆయన్ని బీజేపీ గౌరవించింది. అంబేద్కర్ స్మారకాన్ని నిర్మించటానికి నెహ్రూ అడ్డుపడ్డారు. అంబేద్కర్ సేవలకు భారతరత్న ఇవ్వకుండా నెహ్రూకు మాత్రం ప్రకటించుకున్నారు. అంబేద్కర్ సేవలు గుర్తించి బీజేపీ భారతరత్న ఇచ్చి గౌరవించింది. అంబేద్కర్ నడయాడిన ఐదు ప్రదేశాల్లో పంచ తీర్థ్ కార్యక్రమంతో బీజేపీ శ్రీకారం చుట్టింది. ఏపీలో కూడా కొత్త పిచ్చగాళ్ళు తయారయ్యారు. పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అయ్యింది. అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ మనుగడ కోల్పోతుంది. కాంగ్రెస్ తప్పు తెలుసుకుని అసత్య ప్రచారాలు చేయటం మానుకుంటే మంచిది. జమిలి ఎన్నికలు ఈ దేశానికి కొత్త కాదు. గతంలో చూసుకుంటే దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగాయి' అని మంత్రి సత్యకుమార్ తెలిపారు. 'వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి 2027లో జమిలి ఎన్నికలు వస్తాయని అని చెప్పి పార్టీ నాయకులని కాపాడుకుంటున్నారు. పార్టీలో నుంచి ముఖ్యమైన నాయకులు బయటకు వెళ్లిపోతున్నారని వారిని కాపాడుకునేందుకు జగన్ 2027లో జమిలి వస్తాయని చెబుతున్నాడు. వైసీపీ పార్టీ ఖాళీ అవ్వకుండా కాపాడుకునేందుకు అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నాడు. జమిలి ఎన్నికలపై కమిటీ వేశారు. కమిటీ అభిప్రాయాల మేరకు ఎప్పుడు జరుగుతాయో తెలియ చేస్తారు. పార్లమెంట్లో బలం ఉంటే బిల్లు పెట్టాలని రూల్ లేదు. జమిలి ఎన్నికల వల్ల ప్రజాధనం ఆదా అవ్వడంతో పాటు దేశ అభివృద్ధి నిరంతరంగా కొనసాగుతుంది. రాష్టాల్లో ఏదొక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పాలన పరంగా సంక్షేమ పథకాలు అమలు చేయటంలో ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుంది' అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. దళితులను ఉద్ధరించిన విధంగా, దళితుల కోసం కాంగ్రెస్ పుట్టినట్లుగా కాంగ్రెస్ నాయకులు వ్యవహారిస్తున్నారని బీజేపీ ఎస్సీ రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ విమర్శలు చేశారు. అంబేద్కర్ రెండు సార్లు పోటీ చేస్తే కాంగ్రెస్ ఓడిరచి అనేక విధాలుగా ఇబ్బందులకి గురిచేశారని మండిపడ్డారు. అంబేద్కర్ నడియాడిన ప్రాంతాల్లో బీజేపీ అంబేద్కర్ కోసం చాలా కార్యక్రమాలు చేసిందని దేవానంద్ గుర్తుచేశారు.



# రామకుప్పం పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన చిత్తూరు జిల్లా ఎస్పీవి.ఎన్. మణికంఠ చందోలు









**చిత్తూరు, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**

చిత్తూరు జిల్లా రామకుప్పం పోలీస్ స్టేషన్ ను చిత్తూరు జిల్లా ఎస్పీవి.ఎన్. మణికంఠ చందోలు,శుక్రవారం తనిఖీ నిర్వహించారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్ లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్ వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్ స్పాట్స్ సందర్శించి రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్ధవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని, అదే విధంగా రాత్రి మరియు పగల బీట్ల పని తీరును నిరంతర మానిటరింగ్ చేయాలని, అప్పుడు నేరాలు తగ్గుతాయని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుగా గుర్తొచ్చేది పోలీసులు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు సహాయం చేయాలి. హత్యలు, హత్యాయత్నాలు, తదితర తీవ్ర బాడిలీ అఫెన్సెస్ జరుగక ముందే మొగ్గ దశలోనే తుంచివేయాలన్నారు.మహిళా పోలీసులు ఇంటింటికి వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, మ్యాట్రిమోనియల్ ఇష్యూస్ వివరించాలి. అంతేకాకుండా సైబర్ నేరాలు, ముఖ్యంగా లోన్ యాప్ ల మోసాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఫోక్సో నేరాలపై అవగాహన చేయాలి లన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి. డ్రంకన్ డ్రైవ్ మరియు రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు.అనంతరం స్టేషన్ లో ఉన్నటువంటి ప్రశ్నా పత్రాలను గవర్నమెంట్ స్కూల్ టీచర్ల సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కుప్పం రూరల్ ఇన్స్పెక్టర్ మల్లేష్ యాదవ్, ఎస్. బి ఇన్స్పెక్టర్ భాస్కర్, రామకుప్పం ఎస్.ఐ. వెంకట మోహన్, డి.సి.ఆర్.బి ఎస్. ఐ ఉమా మహేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి







## డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్ ను ఆవిష్కరించిన ప్రముఖ సినీ నటి శ్రీలీల

**శ్రీకాకుళం, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :**

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రముఖ సినీ నటి శ్రీ లీల కోరారు. శుక్రవారం ప్రముఖ సినీ నటి శ్రీ లీల శ్రీకాకుళంలో జి.టి. రోడ్డులో వస్త్ర దుకాణం ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి గారు,డీజీపి ఉత్తర్వులు మేరకు, జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు ప్రత్యేకంగా ప్రచురించిన మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్ధాలు గురించి తెలిపే డ్రగ్స్ వద్దు బ్రో మరియు సంకల్పం పోస్టర్ లను శ్రీకాకుళం పట్టణ సబ్ డివిజన్ డిఎస్పి వివేకానంద్ అందించిగా శ్రీ లీల స్థానిక ఎమ్మెల్యే గోండు శంకర్ తో కలసి ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా యువత మత్తు పదార్థాలు వినియోగానికి బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మీ యొక్క విలువైన జీవితం సమాజం కోసం, తల్లిదండ్రుల కోసం ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. మత్తుకు బానిసైతే జీవితం చిత్తవుతుందని ప్రతి ఒక్కరు గుర్తించాలని కోరారు. పోలీస్ యంత్రాంగం మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని కావున యువత చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మాదకద్రవ్యాల రహిత రాష్ట్రం తీర్చి దిద్దట్లులో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ క్రమంలోనే సామాజిక బాధ్యతతో ప్రజా రక్షణ కొరకు రాత్రి పగలు పోలీసు వారు విధులు నిర్వర్తిస్తున్నారు అని అందుకు అనుకూలంగా యువతతో డ్రగ్స్ వద్దు బ్రో అనే స్లోగాన్ని శ్రీ లీల పలికించారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ షాపింగ్ మహల్ యాజమాన్యం, నిర్వాహకులు, ప్రతినిధులు, తోపాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు : నారా భువనేశ్వరి

**అమరావతి, డిసెంబర్ 20 (కొత్తస్వరం ):**

అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. చిత్తూరు జిల్లాలోని కుప్పంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆమె పర్యటన కొనసాగింది. వనగుట్టపల్లిలో రచ్చబండ వద్ద మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నా క్యాంటీన్లతో పేదలకు అన్నం పెడుతున్నామని, పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని, కుప్పాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తామని నారా భువనేశ్వరి అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ హాయంలో రాష్ట్రంలో ఇండస్ట్రీలు భయపడి అన్నీ వెనక్కి వెళ్ళిపోయాయని, చంద్రబాబు నాయుడు సీఎం అయిన తర్వాత ఇప్పుడిప్పుడే పరిశ్రమలు వస్తున్నాయని నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున ఎన్నో సేవా కార్యక్రమం చేస్తున్నామని, నిరుపేద కుటుంబాలకు విద్యార్థులకు ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున ఆర్థికంగా సహాయ సాకారం అందిస్తున్నామని తెలిపారు. కుప్పం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు రోడ్లు, వీధి దీపాలు, కాలువలు నూరు శాతం పూర్తి చేస్తారని తెలిపారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి రైతులకు నీరును అందుబాటులో తెస్తారని, రైతులు పండిరచే పంటల కోసం కార్గో ఎయిర్‌పోర్టు విమానాశ్రయాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారని నారా భువనేశ్వరి చెప్పారు. వైఎస్సార్‌సీపీ హాయంలో గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు చేపట్టారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చంద్రబాబు గంజాయి లేకుండా యావత్ ఆంధ్రప్రదేశ్‌లోని కమిటీ ఒకటి వేశారని తెలిపారు. కరువు రహితం అనేది ఆంధ్ర రాష్ట్రంలో విజన్ 2047 ప్రారంభించారని, ఆంధ్రప్రదేశ్ ప్రశాంతంగా.. రోల్ మోడల్‌గా చేసి ప్రతి ఒక్కరూ వారి కుటుంబాలతో సంతోషంగా ఉండాలనే మంచి ఆలోచనతో.. ధ్యేయంతో సీఎం చంద్రబాబు ముందుకు వెళుతున్నారని అన్నారు. కుప్పం రుణం తీర్చుకుంటామని.. తమ కుటుంబం ఎప్పుడు ప్రజలకు కట్టుబడి ఉంటామని, టీడీపీ కార్యకర్తలను ఎప్పుడు మర్చిపోలేమని నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు.

## సెంటు భూమి కబ్జా చేసినా తాట తీస్తాం

(మొదటి పేజీ తరువాయి..)

పరిష్కరిస్తాం. వారసుల పేర్లు సరిగా ఉండేలా చూస్తాం. అన్నీ సరిచేసి మీకు పట్టాదారు పాస్‌బుక్ ఇస్తాం. పట్టాదారు పాస్‌బుక్‌లో క్యూఆర్ కోడ్ ఇస్తాం. అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 95,200 పిటిషన్లు వచ్చాయి. జనవరి 9 వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయి. సదస్సుల్లో ఇప్పటి వరకు 3లక్షల మంది పాల్గొన్నారు‘ అని సీఎం తెలిపారు. ఇదిలావుంటే ధాన్యం సేకరణలో ఎక్కడా తప్పు జరగడానికి వీల్లేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. గంగూరు, ఈడ్పుగల్లు గ్రామాలకు వెళ్లారు. గంగూరు రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తేమశాతం నిర్ధరణ చేసే మిషన్ పనితనంపై ఆరా తీశారు. సిబ్బంది, రైతులు, అధికారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఐవీఆర్ఎస్ ద్వారా రైతుల నుంచి తానే అభిప్రాయాలు సేకరిస్తానని చెప్పారు. అధికారుల నుంచి తనకు కావాల్సింది డాక్యుమెంటేషన్ కాదని పేర్కొన్నారు. రైతులకు సేవ చేసే విషయంలో ఇంప్రూవ్‌మెంట్ కనిపించాలని చెప్పారు. ఎక్కడ తప్పు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. తేమ శాతం, ఇతరత్రా అంశాల్లో కచ్చితత్వం ఉండాలని ఆదేశించారు. రైతులకు ఐవీఆర్ఎస్‌పై స్వయంగా అవగాహన కల్పించారు.. దాని ద్వారా ఫీడ్‌బ్యాక్ పంపాలని సూచించారు. తేమశాతంలో సేవాకేంద్రం వద్ద ఎంత రీడిరగ్ వస్తే మిల్లు వద్ద కూడా అంతే రీడిరగ్ రావాలని.. కానీ దానిలో మార్పు ఉంటే చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా జిల్లా గంగూరులో రైతు సేవాకేంద్రాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సేవ కేంద్రంలో ఓ రైతుతో సీఎం చంద్రబాబు మాట్లాడారు.రైతు నుంచి ధాన్యం ఎలా సేకరిస్తారో సీఎంకు సేవాకేంద్రం సిబ్బంది చూపించారు. ధాన్యం తాను ఎలా అమ్ముతున్నది సీఎం చంద్రబాబుకు రైతు ఆకునూరి సాంబశివరావు వివరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట చాలా బాగా పండిరదని రైతు వెల్లడిరచారు. మిషన్ కోత వల్ల రూ. 5, 6 వేలు ఎకరానికి ఈ ఏడాది కలిసి వచ్చిందని రైతు తెలిపారు. దీనికి దిగుబడి పెరగడం కూడా కారణమని రైతు సాంబశివరావు తెలిపారు. గడ్డిని బయోఫ్యూయల్ ప్లాంట్ వాళ్లు తీసుకుంటే మరో రూ.5వేలు వరకూ వస్తుందని రైతు తెలిపారు. గతంలో మనుషులు కోస్తే ఎకరానికి రూ. 6వేలు కోతకు, మరో రూ. 6వేలు కుప్ప వేయడానికి అయ్యేదని రైతు తెలిపారు. తౌలకానికి మరో రూ. 3 వేలు ఖర్చు అయ్యేదని అన్నారు. ఈ లెక్కన అన్ని కలుపుకుని మనుషుల ద్వారా వ్యవసాయం చేస్తే రూ. 25వేలు దాకా ఖర్చు వచ్చేదని చెప్పారు. ధాన్యం డబ్బుల్లో కోత లేదు.. డబ్బులు కరెక్టుగానే వస్తున్నాయని చెప్పారు. ఇప్పుడు ఉన్న వ్యవస్థ బాగానే పనిచేస్తోందని అన్నారు. కోత మిషన్లు బయటనుంచి వస్తున్నాయని వివరించారు. ప్రోక్యూర్మెంట్‌కు షెడ్యూలింగ్ మొత్తం ఒకటిగా లేదా... వేర్వేరుగా పంట కోత కోస్తే పార్ట్ షెడ్యూలింగ్ ఇస్తామని సీఎం చంద్రబాబుకు సేవాకేంద్రం సిబ్బంది వివరించారు. రైతుకు దిగుబడి ఎంత వస్తుందో కూడా నమోదు కావాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఎవరి దగ్గరైనా బాగా పంట పండితే సాగు పద్ధతులు ఏంటో తెలుసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. వరి పంట వేసే రకం తినగలిగేది అయి ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఏ గ్రామంలో ఎంత ప్రోడక్టివిటీ వచ్చిందో చెప్పాలని అన్నారు. ధాన్యం తేమశాతాన్ని ఎలా గణిస్తారో స్వయంగా సీఎం చంద్రబాబు పరిశీలించారు. సీజన్ ముందు అన్ని మిషన్లును తేమ విషయంలో క్యాలిబ్రేట్ చేస్తామని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు.

## సరదాగా విద్యార్థులతో కాసేపు

**కాలేజీ డేస్.. వ్యక్తిగత విషయాలు పంచుకున్న నారా భువనేశ్వరి**

**విద్యార్థుల ముఖాముఖిలో నారా భువనేశ్వరి**

**కుప్పం, డిసెంబర్ 20 (కొత్తస్వరం ):**

ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి విద్యార్థులతో ముఖాముఖి సందర్భంగా ఇచ్చిన సమాధానాలలో కాసేపు సరదాగా, కాసేపు సీరియస్‌గా, ఇంకాసేపు గంభీరంగా ఆమె చాలా అంశాలు ప్రస్తావించారు. మిమ్మల్ని చూస్తుంటే నాకు నా కాలేజ్ డేస్ గుర్తుకొస్తున్నాయి. నేనూ మీలాగే సరదాగా ఉండేదాన్ని. కానీ చదువుకుంటుండగానే నాకు చంద్రబాబుతో పెళ్లయిపోయింది. ఆ వయసులో నాకు ఏమీ తెలియదు. అయినా నామీద నమ్మకంతో నా భర్త చంద్రబాబు హెరిటేజ్ ఎండీని చేశారు. ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేశా. ఇప్పుడీ స్థితికి చేరుకున్నా. ఎవరైనా సరే, కష్టపడనిదే విజయం ఊరికే రాదు. నా హీరో చంద్రబాబు. ఆయన విజనరీ నాకు ఆదర్శం. భార్యాభర్తల్లో ఎవరైనా ఎదగాలంటే ఎవరో ఒకరు త్యాగం చేయాలి తప్పనిసరిగా. ఆయన నాకిచ్చే సమయం ఉదయం 8.30 గంటలకు. తర్వాత ఆయన తన బాధ్యతల్లో మునిగిపోతారు. ఏదైనా అవసరమై ఫోన్ చేయాలన్నా, పీఏకి చేయాల్సిందే. ఆయన ఫోన్ ఎత్తరు. నేను లోకేశ్ విషయంలో చాలా స్ట్రిక్ట్. నన్ను హిట్లర్ అని పిలిచేవాడు. తన స్నేహితులకు కూడా అలాగే చెప్పేవాడు. చంద్రబాబు రాష్ట్రంకోసం, ప్రజల కోసం పనిచేస్తుంటే సింగిల్ మదర్‌గా పెంచానేమో, లోకేశ్‌ను చాలా క్రమశిక్షణలో పెట్టేదాన్ని. నాడు, నేడు రాజకీయాల్లో ఒక తేడా ప్రధానంగా కనిపిస్తోంది. ఒకప్పుడు లీడర్‌కు అనుచరులు పూర్తి విశ్వాసంగా ఉండేవారు . నేడు ఆ విశ్వాసం, బాధ్యత తగ్గిందనిపిస్తోంది. లోకేశ్ బాబు ప్రజలకు న్యాయం చేస్తాడు. నేను హామీ ఇస్తున్నా. నేను సినిమాలు చాలా తక్కువ చూస్తా. బాలయ్య మూవీలో ఏది నచ్చిందంటే చెప్పలేను. చూసినంతలో సమరసింహారెడ్డి నచ్చిందని చెప్పవచ్చు. డైలాగ్స్ నాకు రావు. అయినా వచ్చినంత చెబుతాను. ఒకేవైపు చూడు, మరోవైపు చూడబాక అనే డైలాగ్. ఏ విషయంలోనైనా ఫోకస్డ్‌గా ఉండాలి. అప్పుడు విజయం వరిస్తుంది. అదే ఈ డైలాగ్‌లో చెప్పారేమో. నేను హైలెవల్ పర్ఫెక్షనిస్టుగా ఉండాలనుకుంటా. అంటే ఏ చిన్న లోపమూ కనిపించకూడదు. ఈ క్రమంలో చాలా అలసిపోతా. ధ్యానం నా స్ట్రెస్ బస్టర్. ఉదయం, సాయంత్రం మెడిటేషన్ చేస్తా. ఇంకా మనవడున్నాడు నాకు. వాడితో టైం స్పెండ్ చేస్తే కూడా ఒత్తిడి తగ్గిపోతుంది. వాడికి అయిదు సంవత్సరాలు వచ్చేవరకు నా మాట వినేవాడు. ఇప్పుడు నేను ఏం చెప్పినా వినడంలేదు. నాతో ఫైటింగ్ ఎక్కువ. ఎందుకొచ్చిన గొడవని వాడి మాట వినడం అలవాటు చేసుకున్నా. నాకు మ్యాథ్స్ ఇష్టం లేదు. హిస్టరీ ఇష్టం. చంద్రబాబు ఎకనామిక్స్ పీజీ చేశారు. ఆ సబ్జెక్టు కూడా ఇష్టం లేదు. చాలా డ్రై సబ్జెక్టు. ఆయన ఎలా మ్యానేజ్ చేశారో. నాకు మొదట్లో కుక్స్ లేరు. నేనే వంట చేసేదాన్ని, డ్రైవింగ్ కూడా నేనే. మా ఆయనకు డబ్బులు సేవ్ చేసేదాన్ని. ఇప్పటికి కూడా నేను 20–30 మందికి వంటచేసి వడ్డించగలను. అయితే లోకేశ్ చిన్నప్పుడు నామీద ఒకటే కంప్లయింట్ చేసేవాడు. ఎవరైనా అడిగితే మా అమ్మ ఏమీ చేయలేదు. ఒట్టి రసమన్నం పెడుతుంది అనేవాడు. నేను ఇల్లు ఊడుస్తుంటే బెడ్ కిందనుంచి బర్గర్ల బాక్సులు బయటపడేవి. వాడికి బర్గర్లు, స్నాక్స్ అంటే అప్పట్లో చాలా ఇష్టం. ఫ్రెండ్స్‌తో తెప్పించుకునేవాడేమో. ఇప్పటికీ లోకేశ్‌తో ఆ విషయం గురించి చెప్పి, నవ్విస్తుంటా. నాకు బహుమతుల మీద ఆశలేదు. ఆయనను ఎప్పుడూ వాటిని గురించి అడగను. అయితే మా ఫ్రెండ్ హజ్బెండ్ ఒకరు మ్యారేజ్ యానివర్శరీకి ఆవిడకు డైమండ్ రింగ్ కొని ప్రజంట్ చేశారట. నాకు చెప్పింది. నేను కూడా మాయానివర్శరీకి డైమండ్ రింగ్ కొనమని అడిగాను. నువ్వే ఒక డైమండ్, నీకు ఇంకా వేరే డైమండ్ ఎందుకన్నారు. అలా చాకచక్యంగా తప్పించుకున్నారన్న మాట. అంతే, అప్పటినుంచి నేను ఆయననుంచి ఏ బహుమతులూ కోరలేదు.

# సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ కు వినతి

**ఉప్పల్, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :** ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ఉప్పల్ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి సాకారంతో శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో వెంకట్ రెడ్డి నగర్ కాలనీ సమస్యలపై డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వెంకటరెడ్డి నగర్ లోని ప్రజల సమస్యలు తెలుసుకుని కాలనీ వాళ్లతో కలిసి రోడ్డు మరమ్మత్తుల కోసం ఉప్పల్ డీసీ ఆంజనేయులు కలసి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్, కాంగ్రెస్ నాయకులు బాబు, నరేందర్,మేడ్చల్ ప్రధాన కార్యదర్శి లు కిషోర్ మరియు జంగీర్,సబ్బీర్, సురేష్,సుమిత్,సోమేశ్, లింగం, సంతోష్, సురేష్, ధనమా, పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.



## మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ



**పార్వతీపురం, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :** రాష్ట్ర రవాణా,క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లాకు తొలిసారిగా విచ్చేసిన సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి , పోలీస్ గెస్ట్ హౌస్ నందు మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువాతో సత్కరించి, పూలమొక్కను అందజేసారు.

## హోమియోపతి వైద్య కళాశాలలో సాంప్రదాయ దినోత్సవ వేడుకలు





**ఉప్పల్, డిసెంబర్ 20 (కొత్తస్వరం) :** రామంతపూర్‌లోని జయసూర్య పొట్టి శ్రీరాములు హోమియోపతి వైద్య కళాశాలలో శుక్రవారం సాంప్రదాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లింగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు కళాశాల విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి కళాశాలలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ దుస్తులను ప్రతి ఒక్కరూ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరన్‌కు అవార్డుల పంట..

**ఉత్తమ నటుడిగా విజయ్‌సేతుపతి**

కోలీవుడ్ నుంచి తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ స్టార్‌డమ్ సంపాదించుకున్న వారిలో లీడిరగ్‌లో ఉంటారు విజయ్ సేతుపతి, సాయిపల్లవి. సినిమా సినిమాకు తమ పర్‌ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఫిదా చేయడం ఈ స్టార్ యాక్టర్ల స్పెషాలిటీ. తాజాగా ఇద్దరు ఉత్తమ నటులుగా అవార్డులు అందుకుని వార్తల్లో నిలిచారు. 22వ చెన్నై ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ డిసెంబర్ 19న ముగిసింది. ఈవెంట్‌లో వివిధ కేటిగిరీల్లో అవార్డులను ప్రదానం చేశారు. సాయిపల్లవి ఇటీవలే అమరన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఈ చిత్రానికి ఉత్తమ నటిగా అవార్డు అందుకుంది. ఈ మూవీ ఉత్తమ చిత్రం, ఉత్తమ సినిమాటోగ్రఫీ విభాగాల్లో అవార్డులు అందుకుంది. మరోవైపు విజయ్ సేతుపతి మహారాజ చిత్రానికి ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నాడు. వీరితోపాటు పలు సినిమాలకు వివిధ విభాగాల్లో అవార్డులు దక్కాయి.

అవార్డ్ విజేతలు..

అమరన్ :
ఉత్తమ ఎడిటర్: ఫిలోమిన్ రాజ్
ఉత్తమ సంగీత దర్శకుడు: జీవీ ప్రకాశ్ కుమార్

మహారాజ :
ఉత్తమ నటుడు: విజయ్ సేతుపతి
ఉత్తమ రచయిత: నిథిలన్ స్వామి నాథన్
ఉత్తమ సహాయ నటి: దుషారా విజయన్ (వెట్టైయాన్)
ఉత్తమ దర్శకుడు (స్పెషల్ జ్యూరీ అవార్డ్) : పా రంజిత్ (తంగలాన్)
ఫేవరేట్ యాక్టర్ అవార్డ్ : అరవింద్ స్వామి






## నటి పావని కరణంకు ట్రోలింగ్ సెగ

పుష్ప 2’ సినిమాలో అల్లు అర్జున్ పాత్ర స్వభావాన్ని మార్చి సినిమాలో బిగ్ ట్విస్ట్ తెప్పించిన నటి పావని కరణం. అజయ్ కూతురిగా పుష్పరాజ్ ని చిన్నాయన అంటూ పిలుస్తూ కావేరి పాత్రలో అలరించిన ఆమెకు ప్రస్తుతం ట్రోలింగ్ సెగ తగులుతుంది. సినిమాలో ఆమెపై చేయేస్తేనే ప్రాణాలు తీసిన పుష్పరాజ్ రియల్ లైఫ్‌లో అయితే రాలేదు కదా! ఇంతకీ ఏం జరిగిందంటే.. మంచి థియేటర్ యాక్టింగ్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న పావనిని చూసి సుక్కు ఇంప్రెస్స్ అయ్యి ఆమెకు పుష్ప ఫ్రాంచైజీ లో చోటు కల్పించాడు. అంతకు ముందు ఆమె తిరువీర్ ‘పరేషాన్’ మూవీలో ఫిమేల్ లీడ్‌గా కనిపించింది. ప్రస్తుతం కావేరిగా ఫేమస్ అయినా ‘సమోసా తింటవా శిరీషా’ ఐకానిక్ డైలాగ్ తో అందరికి పరిచయమే. అయితే ‘పుష్ప 2’తో గ్రాండ్ సక్సెస్ అందుకున్న ఆమె వరుస పోస్టులతో సుకుమార్‌కి, అల్లు అర్జున్‌కి కృతజ్ఞతలు చెప్పుకుంది. ఒకటి, రెండు పోస్ట్‌లు వరకు ఓపిక పట్టిన నెటిజన్లు ఆ పోస్టులు కాస్త 4, 5 కావడంతో చిరాకు పడుతున్నారు. దీంతో ఆమె పోస్టుల క్రింద ఇక ఆపేయ్ చిరాకు వేస్తుంది అని కామెంట్ చేస్తున్నారు. కావేరి పాత్రను పార్ట్ 1లోనే లేపేసి ఉంటే మాకు ఈ నస తప్పేది అంటూ కామెంట్ చేస్తున్నారు.

Edited, Printed, Published by K. SUNITHA, Printed at H.No. 40/368-B, 1ST FLOOR, VIDYA NAGAR, KURNOOL - 518001, A.P., SRAVANI OFFSET PRINTERS, BESIDE DURGA TRACTORS, GOOTY ROAD, KURNOOL -518002, A.P., Editor : K. SUNITHA, Cell No. 891 902 4979, Email:sunitharajworks@gmail.com, RNI No. APTEL/2010/31893, WebSite : www.kothaswaram.com